# హీరో

హీరో విధిగా ఆరడుగుల ఎత్తు కండలు తిరిగిన దేహం మీద ఉంగరాల జుట్టుతో మరీ అందంగా వుంటాడట— అతని ఛాతీ ముప్పయ్యెనిమిది అంగుళాలకు తక్కువ వుండడానికి వీల్లేదు దివ్య మోహన విగ్రహము కలిగినవాడు అతను ఎప్పుడూ బ్రహ్మాండమైన పనులే చేస్తూంటాడు విధిగా ప్రేమించి కాసేపు విరహ వేదననుభవించి అందుకో బోలెడు వేదాంతం మాట్లాడి, చివరకు అమాంతంగా పెళ్ళాడమో, లేక మరణించడమో చేసి మరీ గొప్పవాడైపోతాడు ఎప్పుడూ విలువైన దుస్తులే ధరించి ఏ పనీ లేకున్నా హుషారుగా జల్సాగా తిరగడం శ్రీవారి హాబీ సార్ సార్ ఆ హీరో గురించి నేను రాయలేను సార్! ఒట్టుసార్! గొప్పోళ్ళ గురించి గుప్పోళ్ళే గొప్పగొప్ప పుస్తకాలు రాయగలరు సార్! ఆ హీరో గురించి మీరు చదివి తరించదలుచుకుంటే ఏ లైబ్రరీ కెళ్ళినా బండ్లకొద్ది పుస్తకాలు దొరుకుతాయ్ సార్! ఆ ఓపిక కూడా లేకుంటే ఏ సినిమా చూసినా సరిపోద్ది! .

నేను మాత్రం ఓ కథ చెప్పాలనుకుంటున్నాను అందులో హీరో ఎవరో తేల్చాల్సింది మీరే సార్!

కథ క్లోజప్‌లో చెప్పేముందు ఫ్లాష్ బాక్ కొంత చెప్పాలి

అదిగో! లాంగ్‌షాట్‌లో తాళ్ళతోపు . తాళ్ళతోపు వెనకాల కొండ. తాళ్ళతోపు ముందు డొక్కు గుడిసెల వరుస గూడెం ఆ గూడెంకు ఉత్తర దిక్కున నాలుగు ఫర్లాంగుల దూరంలో సున్నం కొట్టిన పెంకుటిండ్లు, వాటి మధ్యలో నిటారుగా నిలుచున్న రెండంతస్థుల మేడగల ఊరు

ఆ ఊరు తిండి వుండి పని లేనోళ్ళది. ఈ గూడెం పని ఉండి తిండి లేనోళ్ళది గూడెంలోని ఏ ఒక్కడి కడుపు సంవత్సరములో ఏ ఒక్క దినమూ నిండదు ఎవరి తలమీద వెంట్రుకలు నూనె రాపి నున్నగ దువ్వి వుండవు ఏ శరీరానికైనా నిండుగా కనీసం పాతది, చిరిగిపోయినది మాసినదైనా-గుడ్డుండదు వాళ్ళ గుడిసెలను ఎండకాలపు గాడుపుదుమారాలల్లో చూడాలె-రివ్వున గాలి దూసుకొచ్చి గుడి

అల్లం రాజయ్య

సెల జొచ్చిందంటె. ఇంటిమీది ఎండు గడ్డిని, జనుప చెత్తను తుంగను ఎత్తుక పోతె, వాళ్ళ బరిబద్ద ఎముకల్లాగా వాసపు కొయ్యలు మిగులుతయ్ ఇంతకూ ఆ గూడెం ఎక్కడిదనుకున్నారు? స్వతంత్ర భారతదేశములోనిదే! ఆ గూడెంలోని మనుషులు సెక్యులర్ రాజ్యంలోని షెడ్యూల్డు కాస్టోల్లు అచ్చ తెలుగులో 'మాదిగోళ్ళు'

గుడిసె గుడిసెకు ఎంతో దయానీయమైన చరిత్ర వుంటుంది? ఆ చరిత్ర దేశానికి కవసరం లేదు క్లోజప్‌లో ఏగుడిసెను పరిశీలించినా ఎంతో హృదయ విదారకమైన కధలు విన్పిస్తాయి ఎన్నో మూగ గుండెలు రోదిస్తూ కన్పిస్తాయి ఎంతో మంది రోతుకు పీక్కుపోయిన కండ్లు వర్షిస్తాయి

వాళ్ళ ఏడుపు, ఆ దరిద్రం, ఆ పెంట కుప్పల బ్రతుకుల దయనీయ స్థితి, ఆ నోరులోని జీవాల మూగవేదన-ఆ అమాయకుల మీద జరిగే క్రూరమైన దోపిడి తరతరాల దగా క్లోజప్‌లో చూడాలంటే చాలా చాలా ధైర్యముండాలి



ప్రస్తుతానికి ఆ గూడెంలో ఓ గుడిసె — ఆ గుడిసె ముంగట ఓ ఎముకల గూడు లాంటి మనిషి పాత చెప్పుతెగిన వుంగటాన్ని పండ్ల సందులో ఇరికిచ్చుకొని సర్వశక్తులూ కేంద్రీకరించి గుంజుతున్నడు అతని ముందు తోలు ముక్కలు, పగిలిన కుండ, అందులో మురుగు వాసనవేసే నీళ్ళు. ఇనుప సువ్వ, ఇనుపగూటం, మోటుకత్తి, నాలుగైదు ఈతకమ్మలున్నయ్. అతని పీక్కుపోయిన ముఖం

మీసాలు, గడ్డం కలిసిపోయి వికృతంగా ఉంది అతనికి కొంచెం దూరంలో గుడిసె సూరు కింద ఇంకో ఎముకల గూడు, ముందట మట్టి ముద్దలాంటి పిల్ల పాలు చీకుతున్నది ఆవిడ తల మాసిరేగి వుంది రేగిన తలను ఎడమచేత్తో పండ్లు బిగబట్టి గోక్కుంటున్నది

గుడిసెకు ఇరవై గజాల దూరంలో మూడడుగుల పిలగాడు దడికొయ్యల పండ్లతో కొరుకుతూ-రెండు దడికొయ్యలను రెండు చేతులతో పట్టుకొని తల రెండింటి మధ్య ఇరికించి రెండు ఎముకల గూళ్ళవేపు నిర్లక్ష్యంగా చూస్తున్నడు ఎవరో రేగడిమట్టి బొమ్మను దడికొయ్యల్లో ఇరికిచ్చినట్లుగా ఉన్నడు ఆ పిలగాడి అవయవాలను దేనికది గుర్తించడం కష్టం అసలు అవి ఏయే అవయవాలు అన్నది నిర్ణయించడం సులువుకాదు ఓ పెద్ద సైజు వంకాయను కుందామా నున్నగలేడు ఆ పిలగాడి ఒంటిమీద గోచిగుడ్డ తప్ప మరేదిలేదు గోచిగుడ్డ ఎప్పటిదో' ఏరంగుదో? పిలగాడికి కూడ తెలియదు, పిలగాడికి బోడి గుండు లాంటి తలమీద జుట్టున్నది, తాటికాయకు వెంట్రుక లతికిచ్చినట్టుగ

సమయము అంబటాల్ల దాటిపోయింది సూర్యుడు ముఖం చిట్లిస్తున్నాడు పాలేరోల్లు, కయికిలోల్లు, అంబలి గంజి త్రాగేసి మూతులు, చేతులు నాకేసి పనుల్ల కురుకుతున్నరు అంబలి గంజి లేనోల్లు, నీల్లుదాగి నిట్టాడులకొరిగి సొమ్మసిలి కూకునోల్లు ఎవరో తరుముతున్నట్టుగ పనులమీది కురుకుతున్నరు ముసలోల్లు, ముతకోల్లు తంగెడు చర్మము కోసం తంగెడు పుల్లలను కోలలతోటి బాదుతున్నరు గునుసుకుంటూ-మూలుగుకుంటూ - ఎవడో పెద్దమ్మ గుడికాడ కుక్కలె ఏడుస్తున్నడు-ఇంకెవడో గుడిసెలో బూతులు తిడుతున్నడు-ఏదో గుడిసెలో పసిగుడ్డు గూడెం పేలిపోయెటట్టు, లేత పేగులు తెగిపోయేటట్టు ఏడుస్తున్నది తాడి చెట్టుమీద రాబందొకటి ఆశగా చూస్తోంది

"ఓర్రాయపోశ - నీబొంద మురుగ రావేంరా? పొద్దెక్కుతంది బర్లకాడికి పోవ్ర?" ఆడ ఎముకల గూడు దడికాడి పిలగాన్నుద్దేశించి అరిచి "దిగలేవే పోరీ! పీక్కతింటన్నవ్—పొద్దెక్కుతంది — తోటోల్లం తెల్లిపోతంద్రు-" సంటిదాని వీపుమీద చరిచింది

సంటిది చావుకేక పెట్టింది

"లం కొడుక ఏం దింటవుర-ఓరి బద్మాషీలమ్డికొడుకా! రావురా' నీయవ్వ నేనాడిదాక తె రెండుగాల్లందుకొని బండక్కొడుత-" పాతసెప్పు కిందేసి పిలగాడ్ని హెచ్చరించిండు ఇంకో ఎముకల గూడు

ఆ దడికాడి పిలగాడి పేరు రాయపోశాలు అందరు పిలిచేది రాయపోశడు కొస్త బెదురుగా మాపిండు

"నీ యవ్వ నేన్ పోనుపో—బర్లు మడుగులబంటె-లేగలు సేన్లల్లకు సెంగలిత్తయ్ లేగలెంటబడి సేనురుకుతె-బర్లు లేపి మక్కల జొత్తయి - అయ్యేనిమిది ఇయ్యేనిమిది నిన్న ఆనోల్లే (బూతు మాటసార్-) నా ఎన్నంత కమిలేటట్టు




గొట్టిందు తెల్జోన్న కర్రచీకి-నీయవ్వ నేను పోనుపో! నా కెరికలేదుపో___" కాల్లు తపతప నేలకేసి కొట్టిందు అటు యిటూ రాగం తీసుకుంటూ ఎగిరిందు

"షోకేం జేత్తవురా! ఏమన్నాలె వురో? మందిపోరగండ్లంత ఇరుసలు మూడు గుంచాలు తెచ్చుకుంటే పదేండ్లు ముడ్డికింద బెట్టుకొని నాగురాలు సేత్త న్నవ్ ఇంగ యీడితో నా సాతగాదు ఇనవయ్య కొడుకు బాగోతం" అని ఆడ మనిషి సదరు రాయపోశని మాతృ మూర్తి నిక్కచ్చిగా చెప్పింది

''గదేందిరో? ముగ్గురి రెక్కలాడితెనె వుంతల కత్తలేదు ఇగ నువ్వు గిట్ల నిత్తెం కిర్కాట్కం బెత్తె బంచత్-ఇగె ట్లరా?-నీయవ్వ! కొడుకా! కావుర మచ్చిం దారా నీకు-ఎట్ల బోవో సూత్త" దడి పొరుక నూడ టీక్కాని సదరు రాయ పోశని అయ్య రాయపోశని మీది కురి కిందు

రాయపోశడు వచ్చే ప్రమాదాన్ని గ్రహించి పరుగందుకున్నడు ఎముకల గూడు కొంతదూరం ఉరికి ఎగపోసింది

గుడ్లు తేలేపి గుండెలు రాసుకొని ఓపిక వచ్చిన తర్వాత కొడుకును తెలంగాణా భాషలో చాలాసేపు తిట్టి "ఎక్కన్నన్న బోంద్రని" దడిపొరకను పిసిరి వేసి పొలాల గట్లమీదినుంచి పనిమీదికి వెల్లిపోయింది

రాయపోశడు తండ్రినుంచి తన్నులు తప్పించుకుని ఫర్లాంగు దూరంలోవున్న ముసలి జువ్విసెట్టు మానికెక్కిండు పర్మనెంటు రక్షణకోసం. వాడికడుపులో ఆకలి కరకర లాడ్తోంది.. వీపులో నిన్నటి

దెబ్బల బాపతు జొన్నకర్ర వాతలుమండుతున్నయ్ వీపు తడుముకున్నడు వాతలు లూకినయ్—తొడలు చూసుకున్నడు—కండ్లల్ల గుబగుబ నీళ్ళూరినయ్—"దొంగ లంజకొడుకు పటేలోడు కమలదున్న పోతుకంటె కటికోడు—విలవిల కొట్టుకున్న ఇడవలేదు—ఆనవ్వ—'' మనసులో తిట్టుకున్నడు

'అయ్యాంగడి, కొడుకీ అంగడి, తల్లేడుబర్లు దొంగయేనాయె—పోరన్ని బుదురకిచ్చి తోల్తడా? బరిగందు కొని గెదిమె—ఆ పటేలోనికేం బుట్టిందో? సన్నటి పోరడని గుడుక సూడకుంట ఏడ వత్తె అడగొట్టె—ఆటకోయిలపోరగండ్లు యాడ పెయిమరిపి కూకున్నరో? అని సేతులకు జెట్టలు, నరుప్పలు బుట్టలావు చెల్లించు కుంటాండు సెడి సెల్లిచ్చుకున్నోళ్ళంత సెర్లకేపోతరు—అతిలావు దుట్టుతనము సేసినోడు అగ్గిల్నే కాల్తడు. పోరన్ని అరుమనుకల (18కిలోల)జొండ్ల కుంచుకుని నాలుగు లేగబొక్కలని ఆటితోటట్టుగ ఎనిమిది బర్ల గొట్టవట్టె—కాలు సెయ్యి ముదురని పోరనికి కయిలిముచ్చు బర్లు ఏడాగుతయి అయిగుడుక పటేలోనోలె బాగా బలిసున్నయ్ ఏడబోయిందో గద—' బిడ్డను వాకిట్లో కుదేసి 'ఓరి రాయపోశో? ' అని ఓలలెత్తి పిలుసుకుంటూ జువ్వి చెట్టుకెల్లి నడిచింది రాయపోశని తల్లి

జువ్విచెట్టుమీద భయంతోటి, దుఃఖంతోటి, నిన్నటి దెబ్బల తాలూకూ నొప్పికొటి, ఆకలితోటి మొండికేసి కూర్చొన్న కొడుకును చూచింది

'పోశవ్వ దిగిరారా! బాంచెన్—నీ కాల్మొక్త—రారా! అంబలిదాగి పోదువు రారా!' జువ్వికింద నిలుసుండి బ్రతిమిలాడింది

'నీయవ్వ నేనురాను పో " కొస్త, మనసు అంబలికోసం మెత్తబడ్డది దిగిన తరువాత కొడుతదేమోనని లోపలభయం పీకుతంది

'రారా! నన్నదిరిచ్చుకోకు, కయికలోల్లంత పోయింద్రు—ఎనుకయిపోతే పటేల్ చెప్పందుకుంటడు మా నాయన కాదు రారా—" అన్నది తల్లి

కొడుకు కాసేపు మౌనంగా ఉండి 'నేనుబోత పోయే?' అన్నడు చిట్టచివరకు

'ఇగో సెల్లెగ్గింతంబలి దాగిచ్చి మంచాలేయ్. నేను జొన్నకోతకు బోతన్న—బాంచెన్ జరపెయిల భయముంచుకొని బర్లకాడ కూసుండు ఆటకోయిల పోరగండ్లతోటి పిర్రగోనెలాడు కుంట పెయి మర్చిన సాట్టలు జెయ్యకు—"అని బుద్దులు చెప్పి జువ్విచెట్టు క్రిందినుంచి నల్లరేగడి చేనల్లోకి బిరబిర నడిచింది

రాయపోశడు చెట్టుదిగి గుడిసెలకొచ్చిండు .చెల్లె వాకిట్లో గుక్కపట్టి ఏడుస్తోంది చిప్పల అంబలి పోసుకొచ్చి చెల్లెకింత తాగిచ్చి తనింతదాగిండు ఎడమ చేత మూతి తుడుచుకుని మూలకున్న కర్ర తీసుకొని వీధిలకు నడిచిండు

గుబగుబమనే గుండెలతోటి పటేలింటికి బోయిండు అటూ ఇటూ తొంగి చూచిండు అరుగుమీద బట్టకుర్చీ ఖాళీ గుండటంచూపి పటేల్ 'కోతల కాడికి పోయిండుగావచ్చు'నని తనకు తనేధైర్యం




చెప్పుకుని అడుగులో అడుగేసుకుంట సడీ సప్పుడు కాకుండ బర్లనిడుసుకుని, లేగల పొది తడుకతీసి లేగలను, బర్లను కొట్టుకొని వాగులకు పోయిండు

నాలుగు ఒత్తెలు తుంగను బరుకు బరుకున పీక్కతింటున్నయ్ నాలుగు బర్లు మడుగు నీల్లల్లో సామూహిక జలక్రీడలోని ఆనందాన్ననుభవిస్తున్నయ్ మొపలు తీసుకుంటూ—తోకలతోటి నీల్ల మీద తపతప కొడుతున్నయ్ మేస్తున్న బర్లు ఓరగంట మడుగులోని నీల్లను చూసికూడ జలక్రీడను విరమించుకొని మేస్తున్నయ్ లేగలు తుంగలో గరిక పోశలను ఏరుక తింటున్నయ్

రాయపోశడు బ్రరెంక చెట్టు మొదట్లో కూర్చుండి కాసేపు ఊతుపాటలు పాడుకున్నడు అడివి అంచుల తీతువపిట్ట శృతి కలిపింది వాగు అవతలి ఒడ్డుమీదనుండి పాలకొడిసె పూల వాసన మత్తుగా వీస్తోంది తీగదారు పొదలు విరిగబూచి తలలూస్తున్నయ్ మోదుగు పూలు పిల్ల గాలికి పడిపడి నవ్వుతున్నాయ్ మడుగుల మీదినుంచి గాలి సల్లగా వీస్తుంటే బర్రెంక చెట్టు నీడన రాయపోశడు నేల మీది కొరిగిండు లేగలు చెట్టు నీడకు చేరి ఒకటినొకటి నాక్కుంటున్నయ్

అట్లా అంటుకున్న రాయపోశని కండ్లు మాపటెండ సురుక్కు మనేటాల్లకు విడిపోయినయ్

కండ్లు తెరిచిన రాయపోశడు 'ఇప్పుడే తెల్లారిందని' కాసేపు వాపోయిండు పడమటిదిక్కు పొద్దును చూచి గాబరాపడ్డడు మూసుకపోతున్న కండ్లను తెరిపించి మడుగుకెల్లి చూచెటాల్లకు గుండె గుబేలు

మంది బర్లులేవు - లేగలు లేవు-దక్షిణపు పొద్దును దీనంగా చూపిండు

'నీ యవ్వగిప్పుడు తెల్లారలే—మాప టేల్లయ్యింది బర్లేడ సచ్చినయ్' అను కొంటుంటే ఆదుర్దాతోటి, భయంతోటి కాళ్ళు గజగజ వనికినయ్

బర్రెంక చెట్టు మీది కెక్కి సుట్టూ చూచిండు దూరంగా బర్లు లేగలు నల్ల రేగడి చేండ్లో మేస్తున్నయ్ - కయికిలో ల్లంత బారులుగా చేను కోస్తున్నరు చేన్లో జొన్న మెదలమధ్య పటేల్ నిలుసున్నడు

గిదగిద చేను దగ్గరికి ఉరికి వచ్చేసరికి కోసిన జొన్న చేను మెదలల్లో పటేల్ 'యమధర్మరాజు వేషంలో ఉన్న చింది మాదిగి చంద్రనోరె' నిలుచున్నడు చేతులో జొన్నకర్ర ఆడిస్తున్నడు

పటేల్‌కు కొంచెం దూరంలో కొడు వళ్ళు భుజాలమీదేసుకొని ఇండ్లకు మళ్లే ప్రయత్నంలో కూలోల్లంత గుడ్డలు, ముంతలు సదురుకుంటున్నారు

పటేల్ రాయపోశని చూడగానే క్లోజప్‌లో క్రూరమైన ముఖంతోటి 'దొంగ లమ్డికొడుక-బర్ల మేపుమని ఆరుమనకలిత్తె రొజు ఇడిపిపెడ్తన్నవ్ — తూమెడుకు దిన్నయ్ — నీ యవ్వమిండెడిత్తడా బంచత్—' చేతులున్న కర్రతోటి రాయ పోశని మీది కురికిండు జొన్నకర్ర రాయ పోశనిమీద దద్దులు లేపుతోంది

'నీ కాల్ మొక్కుత పటేలా — నీ బాంచెన్ పటేలా! నన్ను కొట్టకుండ్రి' రాయపోశడు నల్లరేగడి గరుకు పెల్లల్లో విలవిల తన్నుకుంటూ కోటిదండాలుపెట్టు కుంటూ దీనాతిదీనంగా ఏడుస్తూ వేడు కున్నడు

ఆ దారుణాన్ని, బలిసిన కండలుగల పటేల్ మొరటుచేతుల బలాన్ని భరించలేక మూడడుగుల ఎముకలు తేలిన రాయ పోశడు విలవిల తన్నుకుంటుంటే అంత మంది కూలోల్లు చూచుకుంటూ నిలబడ్డరు. ఒక్కల పెదిమలు విచ్చుకోలే—ఒక్క గుండె కోపంతోటి మండిపడలేదు పసి పోరన్ని, పదేండ్లపోరన్ని ఏ ఒక్కచేయి ఆదుకోలే—ఒక్క కొడువలి ఎదురు తిరు గలే—అరవై మంది తల్లుల్లో రాయపోశని తల్లి వున్నది అదికూడ 'ఇది అన్యాయెం పటేలా పోరన్ని కొట్టద్దు పటేలా—' అనలే—

పటేల్ చేతుల్ని సత్తువకు అలసట కలుగలేదు కోపంతోటి కొరికే పండ్లు ఆపలేదు దెబ్బమీద దెబ్బ కొడతూనే వున్నాడు

నల్లరేగడి పెల్లల్లో బొర్లుతున్న రాయ పోశడు తాడుతెగిన గానం బద్దోలె పివ్వున లేసిండు కట్టెపుల్లల్లాంటి చేతుల్లో నెత్తురు జిలజిల ప్రాకింది బిగుసుకున్న సేతులతో ఓ మట్టి పెల్ల పైకి లేపింది కట్టెపుల్లల్లాంటి కుడిచేయి సుంకత్తోలె ఊగింది గురి చూసింది పటేల్ తల పటేల్‌మంది

"అన్న సంపుతివిర " అని పటేల్ దంటు (జొన్నకర్ర) పారేసిండు

తరతరాలుగా ఎన్నో తలలను తాకట్టు పెట్టుకున్న పెద్దతల-ఎన్నో కొంపలు నిలు వున కూల్చిన తల, ఎంతమందియో చీరలు చింపేసిన తల ఎంతమందియో భూములు గుంజుకున్న తల-మేడలు మిద్దెలు కట్టిన

తల—ఎన్నో తలలను నిర్దాక్షిణ్యంగా తీయించిన తల—మరెన్నో తలల బద్దలు కొట్టిన తల—గండుమీసాలు, ఎర్రెకండ్ల పెద్ద తల—పదేండ్ల మాదిగి రాయపోశని కట్టెపుల్లల్లాంటి చేయివిసిరిన మట్టిపెల్లకు పగిలింది

కొడండ్లు భుజానేసుకొని ఎకరాలకెకరాల చేనుగోసిన కూలోల్లంత ఆ పిలగాడి తెగింపుకు విస్తుపోయింద్రు

ఎడమచేత తలతాకి చూసుకున్న పటేల్‌కు ఎర్రటి నెత్తురు కనిపించేసరికి ఎర్రెకండ్లు బగ్గుమన్నయ్

'ఏడి-ఆ లంజకొడుకేడి-వానవ్వను (బూతుమాటసార్)' అని రెండవసారి విజృంభించుదామనుకునేసరికి — వాడు పదేండ్ల రాయపోశడు లేడిపిల్లవోలె, పంజరం కొరికేసిన చిలుకోలె—అస్తమిస్తున్న సూర్యుని ఎర్రటి కిరణాలను సవాలు చేస్తూ—నల్లరేగడి దుమ్ము రేపుకుంటూ పరుగెత్తుతున్నడు ఎవరికీ అందకుండ

'ఒరేయ్ — పటేలోడా! బగ్గ బలిసినోడా! ఇగరారా!' అని బూతులు తిట్టుకుంటూ పరుగెత్తుతోంది వీరత్వం కూలోల్లకు పరుగెత్తుతున్న రాయపోశడు పడమటి కొండలాగా కన్పించిండు

అట్లా పరుగెత్తిన రాయపోశడు అందరిలాగా చేతులు కట్టుకొని గజగజ వణుకుతూ పటేల్ ఇంటి ముంగటికి పోలేదు అట్లా తాళ్ళతోపు ముంగట కనిపించే గూడెంకు గావి, ఊళ్ళెగ్గాని పోలేదు

వాడు ఎముకలగూల్ల అయ్యఅవ్వలకు మళ్ళా కనిపించలేదు

ఏ బస్సులో ముల్లెలు మోస్తున్నడో? ఏ హోటల్లో ఎంగిలి కప్పులు కడుగుతున్నడో? ఏ సారా కొట్టు ముంగట కూరుకుతున్నడో? ఏ రిక్షాను లాగలేక లాగుతున్నడో? ఏ వర్కు షాపులో మోటార్లు తుడుస్తున్నడో? ఏ లంజెల కంపనీ ముంగట కావలున్నడో? ఏ రైల్లో జేబులు కత్తిరిస్తున్నడో?

కాని సార్! సార్ ! నా మూడడుగుల బక్కచిక్కిన హీరో అలాంటి పనులెప్పుడు చేయడని గట్టిగా నొక్కి చెప్పగలను సార్—హీరోలెప్పుడు చిన్నచిన్న పనులు చేయరంటే చేయరుగాక చేయరు

నా హీరో ఈ దగాకోరు సమాజంతో రాజీపడి తుచ్ఛమైన, నీచమైన బ్రతుకు బ్రతకడు సార్! ఏ అడివి కడుపులోనో అలసటలేని పోరాటాన్ని, ఎంతో ఉన్నతమైన ఆశయాన్ని భుజానేసుకొని తిరుగుతుంటాడు సార్!

రేపటి అందరి వెలుగుకోసం తన జీవితాన్ని చీకట్లచాటున గడిపేస్తూ అదను కోసం ఎదురుచూస్తూ, దొరికిన అదునును సక్రమంగా వినియోగించుకొంటూ గడిపే రాయపోశడు నా హీరో సార్